IJCRT.ORG ISSN : 2320-2882

INTERNATIONAL JOURNAL OF CREATIVE RESEARCH THOUGHTS (IJCRT)

An International Open Access, Peer-reviewed, Refereed Journal

తెలుగు–కన్నడ వ్యవసాయ వర్ష సామెతలు: తులనాత్మక పరిశీలన

బుగదూరు మదన మోహన్ రెడ్డి,

పరిశోధక విద్యార్థి, హైదరాబాదు విశ్వవిద్యాలయం,

పరిచయం:

"గ్రామాలు భారతదేశపు పట్టుగొమ్మలు" మహాత్మా గాంధీగారి వాక్యం అక్షర సత్యం. దేశంలో ఇప్పాటికి ముప్పావు వంతు జనాభా గ్రామాలలోను, వ్యవసాయ వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. దేశంలో వ్యవసాయం దేశ సంస్కృతి, సంప్రదాయాలలోనే కాదు. దేశ ఆర్థికవ్యవస్థలోను కీలక పాత్ర పోషిస్తుంది.

తెలుగు–కన్నడ ప్రజల మధ్య భౌగోళిక, భాషా, చారిత్రిక, సాహిత్య, సాంస్కృతిక సంబంధాలు బలంగాను, అధికంగాను ఉన్నాయి. రెండు ప్రాంతాలను పాచి చూసినప్పుడు ఒకేవిధమైన సారుప్యతలు, సామీప్యాతలు ఉండడం గమనిచవచ్చు. వ్యవసాయ ఆధారిత రాష్ట్రాలు కావడం ద్వారా జానపద సాహిత్యంలో కూడా ఆ వ్యవసాయంకి సంబంధించిన అనేక అంశాలు ఒకదానితో ఒకటి ముడివేసుకొని ఉన్నాయి.

వ్యవసాయం మానవులకు కీలకమైన వృత్తి. కానీ వ్యవసాయానికి అన్నిదేశాల వాతావరణం అనువుగా లేవు. కేవలం కొన్ని దేశాలకు మాత్రమే ఆ సౌలభ్యం ఉంది. అటువంటి దేశాల్లో భారతదేశం ఒకటి. పురాతన కాలం నుండి ఉంటువస్తున్న వృత్తి ఈ వ్యవసాయం. సాహిత్యాలలో జానపద సాహిత్యం కూడా పురాతన కాలం నుంచి వస్తున్న సాహిత్యం. గ్రామీణ వ్యవస్థ అధికంగా కలిగిన భారతదేశంలో జానపదులో ఆయా భాషల్లో కచ్చితంగా తను అనుభవాన్ని సామెతల రూపంలో పొందుపరిచి ఉన్నారు. తెలుగులో ఉన్న సామెతల్లో వ్యవసాయ సామెతలు ముఖ్యంగా వర్షానికి సంబంధించిన సామెతలను ఈ వ్యాసంలో విశ్లేషణ చెయ్యడం జరుగుతుంది.

సామెత–వివరణ:

సామెత 'సామ్యత' అనే పదానికి రుపాంతం. అనగా పోలిక చేసి చెప్పడం. ఎప్పుడో జరిగిపోయి సందర్భాన్ని ఇప్పుడు జరుగుతున్న సందర్భానికి పోల్చి చెప్పడం. ముఖ్యంగా అనుభవ పూర్వకంగా తెలియజెప్పడం సామెత ప్రధాన ఉద్యేశం. తెలుగు వాళ్ళు 'సామెత' అని కన్నడ వాళ్ళు 'గాదె' అని నిర్వచించుకొంటారు. 'గాదె' అనగా ప్రాచీన మైనది అని అర్థం. తరతరాలుగా వస్తున్న మాటగా కూడా కన్నడవాళ్ళు పేర్కొనడం జరుగుతుంది.

సామెతలు అన్నవి జానపదుల అనుభవ రస గుళికలు. వాటిని వారే సృష్టించారు. సామెతలను నిర్వచించడంలో పరిశోధకులు, రచయితలకంటే వారే సిద్ధహస్తుల్లా కనిపిస్తున్నారు. జానపదుల దృష్టిలో సామెతల మీద అభిప్రాయాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి. వీటిని meta proverbs అని కూడా పేర్కొనవచ్చు. సామెతల గురించి సామెతలో చెప్పడంగా భావించవచ్చు. ఉదా: మెటాడేటా, మెటా సైన్స్, మెటా థింకింగ్ లా పరిగణించాలి.

తెలుగు: పెద్దల మాట చద్ది ముట

సామెతలేని మాట అమెత లేని ఇల్లు

పెద్దల మాట పొల్లుబోదు. పదిమంది తోవ తప్పుబోదు

కన్నడ: ఊటకి ఉప్పిన కాయ్–మాటకు గాదె

(భోజనానికి ముందుగా ఊరగాయ్–మాటకు ముందు సామెత)

గాదె వెదక్కి సమాన (సామెత వేదానికి సమానం)

వేద సుళ్ళాదురు గాదె సుళ్ళాగదు (వేదం తప్పుకావచ్చు సామెత తప్పుకాదు)

గాదెగళును లెక్క ఇట్నోరు యారు–కాది తూటమ ఎంసోదు యారు

(సామెతల లెక్క తెల్చినోళ్ళు ఎవరు– కాదిలో (గుడ్డపై సూదితో వేసే ఎంబ్రైడింగ్) బొక్కలు ఎంచినోళ్ళు ఎవరు)

హిందీ:

ఇంగ్లీష్: *A proverb can be a double-edged sword*

When in doubt, use a proverb

Proverbs are like old wine, they get better with age

A proverb is like a mirror, showing you what you already know.

రచయితల నిర్వచనాలు:

భాషా సాహిత్యాలలో పరిశోధనలు, రచనలు చేసే రచయితలు కూడా సామెతలకు గురించి విలువైన నిరచనాలే పేర్కొన్నారు.

తెలుగు:

- *"సామెతలు మొత్తం అంతా కలిపితే ఒక విజ్ఞాన కోశం"*– విశ్వనాథ
- *"ఒక జాతి సాంఘీక జీవనంలో అన్ని అంచులను సూటిగా ధాటిగా ఎత్తిచూపే ప్రక్రియ సామెత"*– సి.నా.రె.
- *"ఒక భాషయందలి యందంచందము లందన్నిటి దొకెత్తు: కేవలం సామెతలదో దొకెత్తు"*– బిరుదరాజు రామరాజు.
- *"గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని, వర్తమానాన్ని ఆలోచిస్తూ, భవిష్యత్తునకు వర్తించునది సామెత"*– ఆరుద్ర
- *"సామెత సామాన్య కుటుంబ జీవనం నిండి పుట్టింది"*– సంపత్ రాఘవాచారి(తెలుగు సామెతలు పీఠిక)
- జానపద విజ్ఞానంలోని అన్ని అంశాలలాగే సామెతలు కూడా సంప్రదాయమైనవి. వాటి ప్రత్యేకత వివేకవంతమైనవి. (డా॥ సుందరం, ఆర్వీయస్. 'ఆంధ్రుల జానపద విజ్ఞానం' 1992 . పుట.172)
- "సామెతను నిర్వచించడం అంత తేలికైన విషయం కాదు అలా చేయడం ఏదో సామెత చెప్పినట్లే అవుతుంది – డా॥ జి ఎస్ మోహన్(జానపద విజ్ఞానాధ్యేయం)

కన్నడ:

కన్నడ సాహిత్యంలో కూడా రచయితలు సామెతలు వారిదైన కోణంలో నిర్వచించారు.

- *పరంపరాగతంగా జానపదుల నోటి నుంచి నోటికి సంక్రమిస్తునన్ రసధార ఈ గాదెగళు(సామెతలు)* –మాస్తి వేంకటేశ అయ్యంగార్
- *"గాదె(సామెత) ఒక తారం నుంచి ఒకతరానికి వచ్చిన పద సంపద. అది జనవాణి, దైవవాణి"* – గో.రామస్వామీ అయ్యంగార్
- *గాదెగళు జీవన యాత్రలో బుద్ధిని బోధించే దారి దీపాలు* –ఎల్.ఆర్. హెగడె
- *గాదె అన్నది నిత్య నూతన వాక్యం. సందర్భానుసారంగా బయటికి వచ్చే జ్ఞాన దీపికలు* –రాగౌ
- *గాదె జనతా జీవననాడి అనుభవైక సూక్తులు* – మంజుళా మానస

పై నిర్వచనాలు గమనిచడం ద్వారా ఒకరి సంపద కాదు. ఒకరివల్ల సృజించబడింది కాదు అన్న విషయం అర్థమవుతుంది.

1. **వర్ష సామెతలు**

పంచభూతాల్లో నీరుకు ప్రత్యేక స్థానం ఉంది. భూమి మీద జీవించే ప్రతిజీవి మనుగడ నీటితో ఆధారపడి ఉంటుంది. భారతదేశంలో సాగుకు 90% కి పైగ వర్ష ఆధారితంగానే ఉంటుంది. మిగలావి కొన్ని నదీ జలాలు, భూగర్భ జలాలతో కూడుకొని ఉంటుంది. వీటన్నింటిలో భారతదేశం వర్షం ప్రభావ ఆధారితంగానే ఎక్కువ పంటలు పండుతాయి. వ్యవసాయరంగంలో వర్షం పడితే వచ్చు మార్పులు, ప్రయోజనాలు, నష్టాలు మొదలగు వాటి గురించి తెలిపే సామెతలతో పాటు ఆ వర్షం పడే క్రమంలో వర్షం సూచికతో కూడుకొన్న నమ్మకాలను కూడా రైతులు సామెతలగా ఏర్పరుచుకొన్నారు.

2.1.వర్ష సూచన సామెతలు:

'వాన రాకడ–ప్రాణం పోకడ' ఎవరికీ తెలియవు. కానీ జానపదులు వాటిని తమకున్న ప్రకృతి అవగాహన, తరతరాల వారసత్వ అనుభవాలతో వర్షం రాకను, వాటికి అనుగుణమైన సూచికలను, వర్ష ప్రభావాన్ని, లాభాన్ని, నష్టాన్ని అంచనా వెయ్యడం మెదలు పెట్టారు.

2.1.1. వాతావరణ సూచికలు:

తూర్పున ఇంద్రధనుస్సు దూరాన వాత వర్షం.

సింగిడి వేస్తే పదునైదు రోజులు వర్షం

పడమట కొఱ్ఱు పడితే పాడి ఆవు రంకె వేయును

పడమట కొఱ్ఱు వేస్తే పాడుపడిన గుంటలన్నీ నిండును

పై సామెతలలోని సింగిడి(తెలంగాణ), కొఱ్ఱు(రాయలసీమల) అన్నవి ఇంద్రధనుస్సుకి పర్యాయ పదాలు. ఆకాశంలో ఏర్పాడే ఇంద్రధనుస్సు ఆధారంగా వర్షాన్ని రైతులు అంచనా వెయ్యడం ఈ సామెతల ద్వారా తెలుస్తుంది.

ఈ ఇంద్రధనుస్సులో పడమట వస్తే మంచి వర్షం వస్తుందని **తూర్పున ఇంద్రధనస్సు వేస్తె తుంగ మడిలోను పడమర ఇంద్రధనస్సు వేస్తె బండ మీద పశువులను కట్టాలి** అన్న సామెత తెలుపుతుంది.

గట్టుమీద మేఘం వేస్తే కళ్ళ ముందర వాన

కనుమలమీద మొగిలివేస్తే కన్నుల ముందర వాన

మొగిలుకు పర్యాయ పదం మేఘం. పై సామెతలు మేఘం ఆధారంగా చేసుకొని వర్షం ఎప్పుడు రాబోవుతున్నవో చెప్పే సామెతలు.

పడమట మెరిసిన పది ఘడియలకు వాన వచ్చును

ఉరిమితే వాన కురియక మానదు

ఈ సామెతలు ఉరుము –మెరుపుల ఆధారంగా వర్షం రాకను అంచనా కట్టడం జరిగింది.

దాపున గుడి(చంద్రుడి చుట్టూ కట్టిన వలయం) కడితే దురాన వర్షం

వరదగూడు వేస్తే వర్షం ఖాయం

చంద్రుడి చుట్టూ పౌర్ణిమ రోజుల్లో ఆవరించి ఉన్న తెల్లని ఆవృతాన్ని వరద గూడు, దాపన గుడి అని అంటారు. అలా ఏర్పడడాన్ని ఆధారంగా చేసుకొని రైతులు ఈ సామెతలను ఏర్పరుచుకొన్నారు.

2.1.2. జంతుజాల సూచికలు:

గొర్రెలు గుంపుగా జేరితే గొప్పవర్షం

చెట్టు మోడయితే చేరికలో వాన

తూర్పున కొర్రు వేస్తె దుక్కిటెద్దు రంకె వెస్తుంది

మట్టిగడ్డలో కప్ప కూస్తే ఒక ఝామునకు వర్షం

ఒట్టి పెంటల్లో కప్పు అరిస్తే వానోస్తుంది.

కల్లు చట్టిలో పొడగువ్వ పడితే నాల్గురోజుల్లో వాన

కోడి రెక్క ఆరవేస్తే గొప్ప వర్షం

పై సామెతలలో ఎద్దు రంకెను, గొర్రె గుంపును, కప్పల అరుపులను, విప్పారిన కోడి రెక్కను ఆధారంగా వర్షంరాకను జానపదులు తరతరాలుగా గమనించిన అనుభవాన్ని సామెతల రూపంలో జ్ఞానంగా దాచుకొన్నారు.

2.1.3. ఇతర సూచికలు:

అన్ని కార్తెలు తప్పినా హస్త తప్పదు
దరిద్రుడు తల కడిగితే వడగళ్ళ వాన కురిసిందట
శనివారపు వాన శనివారం విడువదు

కార్తెలు, వారాలను, మరికొన్ని ఉపమానాలను ఆధారంగా చేసుకొని వర్షసూచికల పట్ల జానపదులు విశ్వాసం ఏర్పాటు చేసుకొన్నారు.

2.2. వర్ష రహిత సూచన తెలిపే సామెతలు:

రైతులు వర్షం రాకని అంచనా వేసినట్టే వర్షం రాకపోవడాన్ని కూడా వాతావరణం, జంతుజాలం, ఇతర సుచికలతో అంచనా వెయ్యడం జరిగింది. అవి ఈ కింది విధంగా ఉన్నాయి.

వడగళ్ళ వాన పడితే వోరుపు

రాయలసీమలో ఈ నమ్మకం ఎక్కువగా ఉన్నది. ఇప్పటికి హిందూపురం ప్రాంతంలో వడగండ్ల వాన పడడం అశుభంగా భావిస్తారు. ఒకసారి వడగండ్ల వాన పడితే ఏడేళ్ళు వాన పడలేదు అంటని కొందరు నా క్షేత్రపర్యటనలో వెల్లడించారు.

హస్తచూసి అందరం పోదాం

వర్షం పట్ల అన్ని కార్తెలు తప్పినా హస్త తప్పదన్న నమ్మికమైన సామెత కూడా ఉంది. వర్షం మిగలా కార్తెల కురవకపోయిన హస్త మాత్రం తప్పక కురుస్తుంది. ఒకవేళ అది కూడా కురవకపోతే కరువు కాలంవచ్చిందంటని అందరం కూడా వలస పోదాం అన్న భావనలో ఈ సామెత కరువు గురించి ప్రస్తావన చేస్తుంది.

ఉత్తర చూసి ఎత్తర గంప – విశాఖ చూసి విడవర కొంప

హస్త, చిత్త, విశాఖ కార్తెలు వర్షం రైతులకు కీలకం ఆ కార్తెల్లో కూడా వర్షం పడడం ఆలస్యం అయితే ఇక కరువు సంభవిస్తుంది. కావునా అందరు వలసలు బయలుదేరుతారు. అందుకే ఎత్తర గంప. పూర్వం గంపలలో ప్రయాణ సామాగ్రిని ఉంచుకోని బయలుదేరేవారు. ఈ సామెతల్లో కరువుకు, వర్షలేమికి కొలమాన సూచికలు దొరుకుతాయి.

జానపదులు వారి అనుభవజ్ఞానంతో వర్షం రాకను, పోకను అంచనా వేసినప్పుడు కొన్ని సార్లు జరిగాయి. మరికొన్ని సార్లు జరగలేదు. కానీ వారి నమ్మకాలను కాదనలేము. ఆఖరికి తిరిగి అదే జానపదులు వర్షం రాకను పోకను చెప్పలేమన్నారు. ఈ ఒక్క సామెత చాలు వారి గరిమ దృష్టిని తెలియజేస్తుంది.

2.3. వర్ష ప్రయోజన సామెతలు:

వర్షం ప్రకృతిలో జీవుల మనుగడకు ముఖ్యం. ఈ వర్షం కోసం వేదాల్లో యజ్ఞ–యాగాదులకు సంబంధితమైన శ్లోకాలు ఉన్నాయి. పురాణాల్లో వర్షయోగాన్ని తెలిపే ఎన్నో ఘట్టాలు ఉన్నాయి. కృష్ణుడు వర్షం కోసం దేవతాధిపతి అయిన ఇంద్రుడిని కాదని గోవర్దన గిరికి పూజించడం జరుగుతుంది. వర్షం ఒక అక్షయపాత్ర వంటిది. **వాన వుంటే కరువు, పెనిమిటి వుంటే పేదరికం లేద**ని రైతుల విశ్వాసం.

తొలకరి వానకు చెరువు నిండిన తొలి చూలులో కొడుకు పుట్టితే అదృష్టమే

వర్షాకాలం మొదలయ్యే సమయంలో కురిసే మొదటి వానను తొలకరి వాన అంటారు. భారతీయ వ్యవసాయ అనుకూలత పరంగా చూస్తే నైరుతి రుతుపవనాల ద్వారా తొలకరి వానలు మొదలవుతాయి. మే–

జూన్ మాసాల్లో ఈ వర్ష ప్రభావం ఆరంభమవుతుంది. అటువంటి తోలకరికే చెరువులు నిండితే తొలి కానుపుతో కొడుకుని కన్నంత సంతోషం కలుగుతుందని ఈ సామెత అంతరార్థం.

అనూరాధలో అడిగినంత పంట.

ఆశ్లేషలో అడుగుకొక చినుకుపడినా అడిగినన్ని వడ్లు పండును.

ఆరుద్ర కురిస్తే దారిద్ర్యం లేదు.

ఆరుద్ర వాన ఆదాయాల బాన.

స్వాతి మెరుపులు మంచి పంటలు

వర్షం ద్వారా పంటలు బాగా పండుతాయని పై సామెతలు తెలుపుతున్నాయి.

పంటలే కాకుండా రైతుల ఆరోగ్యం కూడా వర్షం మీదనే ఆధారపడి ఉంటుందని **అనూరాధతో మనో రోగాలు పోతాయి, ఆశ్లేష తడిస్తే ఆరోగ్యం** అన్న సామెతలు తెలుపుతున్నాయి. మనుషులే కాదు **ఆశ్లేషలో తడిస్తే, ఆడది మొగోడవుతాది–ఆశ్లేష కురిస్తే ముసలియెద్దు రంకె వేస్తుంది.** వర్షం పడడం అమృతంతో సమానంగా తలచే సామెతగా **ఆరుద్రలో వర్షం, అమృతంతో సమానం** నిలుస్తుంది. భూతాపాన్ని తగ్గించేది వర్షమే ఆ విషయాన్ని **మృగశిర కార్తెలో ముంగిళ్లు చల్ల బడును, మృగశిరతో వానతో ముల్లోకాలు చల్లబడుతాయి.** రైతుల వేసే పంటకు ఈ **తొలకరి వాన మొలకలకు తల్లి**గా భావిస్తారు.

వర్షం పడే సూచికలలో జానపదుల విశ్వాసాలలో కంటే వర్షం ప్రయోజనం అంచనా కట్టడంలో ఎంతో వాస్తవికత ఉంది. వానలు దాన ధర్మాలను బట్టి పడుతాయి. అని తెలిపడానికి **వాన లెక్కడా? అంటే, దానధర్మాలున్న ధరణి లోన్నట్లు** సామెత తెలుపుతుంది.

2.4.వర్ష నష్ట సామెతలు:

ప్రతి దానిలోనూ మంచి చెడు ఉంటాయి. వ్యవసాయం అన్నది అదునేరిగి చేసే క్రియ. మొలకలప్పుడు పడే వర్షం మేలు చేస్తే కోతలప్పుడు పడే వర్షం కీడు చేస్తుంది. వర్షంవల్ల తమకు ఒకానొక దశలో జరిగే నష్టాలను తెలియజేసే సామెతలు కూడా ఉన్నాయి.

ఆకాలపువాన అరికలకూడు

ఇప్పుడు సాధారంగా భావించే అన్నం ఒకప్పుడు అపురూపం. కేవలం ధనికుల ఇళ్ళలోనే వండుకొనేవారు. సామాన్యులు ఎక్కువగా తినే వంటకం అరికల కూడు. ఈ విషయాన్ని **ఆరుగాలం కష్టపడినవారికి ఆరికలకూడు నిన్నగాక మన్నోచ్చినోల్లకు వరిన్నమా?** అన్న సామెత తెలుపుతుంది. వర్షం అదును తప్పి వస్తే ఈ వరి పంట పండక అందరు పేదవారి మాదిరి ఆరికల కూడు తినవలసి ఉంటుందన్నది ఈ సామెత తెలుపుతుంది.

చందాల కార్తెలో కురిస్తే ముంగారు పాడు

ఫాల్గుణ మాసంలో వాన వరికి చెరుపు

పాల్గుణ మాసం ఫిబ్రవరి–మార్చి మధ్య కాలం. అప్పటికి రబీలో వారి పంట కోతలకు వచ్చే సమయం అప్పుడు కురిస్తే ఆ పంట నాసయనం అవుతుంది అని ఈ సామెత ద్వారా తెలియవస్తుంది.

మూల కురిస్తే ముంగారు పాడు

ఈ మూల కార్తె సమయానికి రబీ సాగు మొదవ్వుతుంది. నాట్లు, విత్తనాలు విత్తుకోవడం జరుగుతుంది. అప్పుడు ఎడతెరిపి లేకుండా వానలు పడితే విత్తిన విత్తనానికి, నాటిని నాట్లకు నష్టం కలుగుతుంది. ఆదిలోనే పంటలు నాశనం చెయ్యడాన్ని ముంచడంగా పేర్కొనడం జరిగింది.

విశాఖలో కురిస్తే విషం పెట్టినట్టు

విశాఖలో వర్షం, వ్యాధులకు హర్షం

ఖరీప్ వేసిన పంటలు చేతికి వచ్చి రెండో పంటను పెట్టడానికి, రబీ సాగు చేస్తున్న పంటల్లో అంతర్గత పంటలు వేయడానికి అనుకూలంగా ఈ విశాఖ కార్తె ఉంటుంది. ఈ కార్తెలో కొంచం పొడి వాతావరం అవసరం అలాకుండా వర్షం పడడం జరిగితే రెండో పంట సాగుకు అంతర్గత పంటలలో ఒకదాని నుంచి ఒకటి తెగుల్లకు గురికావడం జరుగుతుంది. వర్షం సందర్భం కానీ సందర్భంలో పడితే రైతులకు మేలు కంటే నష్టం ఎక్కువ జరుగుతుందని అర్థమవుతుంది.

మాఘమాసపు వాన, మొగుడులేని జాణ

ఈ మాసానికి(ఫిబ్రవరి) దాదాపుగా అన్ని పంటలు ఇంటికి చేరి ఉంటాయి. అప్పుడు పడే వర్షం ఏ పంటకు అనువు కాదు. అందుకనే ఈ మాసపు వాన మొగుడు లేని భార్యతో పోల్చడం జరిగింది.

వడగళ్ళ వాన పడితే వోరుపు

రాయలసీమలో ఇప్పటికి వడగళ్ళు పడితే ఆశుభంగా భావించే రైతాంగం ఉంది. వారిని అడగగా పూర్వం ఇలా వడగళ్ళు పడ్డ తర్వాత చాలా ఏళ్ళు వర్షం పడలేదు అని తెలిపారు.

హస్త ఆదివారం వస్తే చచ్చేటంత వాన హస్త కార్తెలో చల్లితే అక్షింతలకయినా కావు

కార్తెల్లో వర్షం రాకపోవడాన్నే కాకుండా ఆ కార్తెలు ఏఏ వారాలలో వస్తే వర్షంవస్తుందో రాదో అన్న నమ్మకాన్ని కలిగి ఉనారన్నది పై సామెత స్వరా తెలియవస్తుంది.

3. కన్నడ వర్ష సామెతలు

నీరు మానవాళికి ఎంత ప్రాణాధారామో వ్యవసాయానికి కూడా అంతే ప్రాణాధారం. భారత దేశ వ్యవసాయం ఎక్కువగా వర్షంపై ఆధారపడి ఉంది. ఆ వర్షం రాక, దాని ప్రాధాన్యత, వాటివాళ్ళ కలిగే ప్రయోజనాలు ఒకోసారి కలిగే నష్టాలు మొదలైన తెలుగులో ఏవిధంగా సామెతలు ఉన్నాయో కన్నడ సాహిత్యంలో కూడా ఉన్నాయి.

మళె బందరె సోబగు ఇల్లదిద్దరె కోరగు

(వాన పడితే అందం–లేకపోతే దుఖం)

వర్షమే ప్రాణకోటికి జీవనాధారము. అందులో పంటలు పండించే రైతులకు వర్ష రూపేణ అందే నీరు చాలా ముఖ్యం. ఆ వర్షం ఉంటే ఉన్నచోటే జీవితం అందంగా ఉంటుంది. అదే లేకపోతే వలసపోయెంతటి దారిద్ర్యం ఎదురవుతుందని చెబుతున్న సామెత.

మళె బందరె ఇళె తాళదు (వాన కురిస్తేభూమి తాళలేదు)

ఒకోసారి ఆ వర్షం దెబ్బకు రైతులు పంటలే కాదు. నేలను సైతం ముంచేసే అంత వర్షం కూడా వస్తుంది. అది అతివృష్టిని తెలియజేస్తుంది. అలాగే పంట వేయడానికి విత్తనం, సాగు ఎంతటి ముఖ్యమో **ఉత్తు బిత్తిద బత్తవాదరూ మళెయిల్ల బళెయదు** (విత్తనం వేస్తే కాదు వర్షం వస్తే పంట పండుతుంది) ఈ సామెత తెలియజేస్తుంది. **ఆరుకాల మళె హుయ్యిద్దురూ ముత్తగక్కి మూరె ఎళె** (ఆరుకాలలపాటు వర్షం పడినా ముత్తుగ చెట్టుకి మూడే ఆకులు) ఈ సామెత వర్షం కరువు కాటకాలను సంభావించెంతలానే కాకుండా సుదీర్ఘ కాలంపాటు కూడా పడే అవకాశమున్న పరిస్థుతులను స్పష్టపరుస్తుంది.

మూల మళె నెలద గండ(మూల వాన నేలకు భర్తలాంటిది)

ఈ సామెతలో వర్షం నెలకు భర్తలాంటిది. ఆ వానల ద్వారా నేలంతా పచ్చగా మారుతుంది. అడువులు, పచ్చికబయళ్ళు, పంటపొలాలు అన్ని భూమికి ఒక నిండుతనాన్ని తీసుకొస్తాయి. దీన్ని జానపదులు ఒక ఆడపడుచుకు భర్త ద్వారా ఏర్పడే నిండుతనం, ముత్తైదుతనంలా ఉంటుందని అద్భుతమైన పోలిక చేస్తూ చెప్పారు.

రైతునిగి భాష కోట్ట మళె హస్త (రైతుకు శక్తిని ఇచ్చేది వర్షం)

రైతుకు పొలాన్ని పంటగా మార్చే క్రమంలో నీరు కీలక వనరు. ఆ నీరు లేకపోతే పొలాలు బీడుగా మారుతాయి. నీరు ఉంటేనే రైతుకు శక్తిని ఉంటుందని ఈ సామెత తెలియజేస్తుంది. రైతుకు వర్షం అన్ని ప్రయోజనాలతో కూడిన ఆక్సిజన్ లాంటిది. పూర్వం ప్రత్యక్ష అధారిత సాగునే రైతులు ఎక్కువగా చేసేవారు. ఆధునిక పద్ధతుల భూగర్భ జల వినియోగం అధికంగాఉంది. భూగర్భ జలం కూడా వర్షపు నీటి ఆధారిత నిర్మితమైనదనే భావించాలి.

మొదలు మళె ఆమేలె కోళి(తొలిన వర్షం తర్వాత బురద)

మొదటగా వర్షం తేటగా నేల మీదకు వస్తే ఆది వివిధ పరిసరాల్లో పడడం, ప్రవహించడం ద్వారా కొంత స్వచ్ఛతను కోల్పోతుంది. కొండ ప్రాంతాలు, పచ్చిక బయళ్ళు వదిలిపెడితే మిగలా చోట్ల అంతా బురదగా మారిపోతుంది.

ఆషాడక్కి మళె హుయ్యురేను? దుడుకు మక్కు హుట్టిదరేను?

(ఆషాడంలో వానపడితే ఏమి? అణుకువ లేని బిడ్డలు పుడితే ఏమి?)

ఆషాడంలో ఏవిధమైన పంటల సాగు ఉండదు. ఎండలు వీపరీతంగా ఉండడం కారణం కావచ్చు. ఆటువంటి పరిస్థితుల్లో వర్షం పడితే ఏ పంటకు ఉపయోగం? అలాగే పెద్దలు చెప్పినవి వినకుండా ఎడ్డం అంటే తెడ్డం అనే కుమారులు పుట్టితే తల్లిదండ్రులకు ఏం ప్రయోజనం ఉండవని ఈ సామెత అంతరార్థం.

హోలనోడు బిత్తు– మళె నోడు బిత్తు(పొలం చూసి విత్తు–వాన చూసి విత్తు) నేల అనేక స్వరూపాలుగా ఉంది. ఒకో నేలకు దాని స్వభావాన్ని బట్టి పంటలు వేస్తేనే చక్కగా పండుతాయి. అలాగే వర్షం కూడా ఆయా కార్తెల అనుకూలంగా పంటలకు ఉపయోగకరంగా ఉంటాయి. ఉదాహరణకు **భరణి సురిదు–ధరణి బదుకితు** (భరణి కురుస్తుంది–ధరణి బతుకుతుంది) అనేది ఉపయోగకరమైన వర్షం అయితే **'విశాక మళె విష మళె'** (విశాఖ వర్షం విష వర్షం) అన్న సామెత ఆ కార్తెలో పడే వర్షం పంటకు ఏవిధంగా కీడు చేస్తుందో తెలియజేస్తుంది. పై సామెత ఇంతటి వివరణాత్మకమైనది.

మళె ఆదరె కట్టల్ల మక్కళు ఉండరె తప్పల్ల (వర్షం నష్టం లేదు–పిల్లలు అయితే తప్పుగాదు)

మళె బందరె కేడల్ల మగ ఉండరె కెడల్ల (వానొచ్చినా కొడుకు పుట్టిన చెడెల్దు)

పిల్లలు ఉంటే ఇల్లు ఎంత కళగా ఉంటుందో వర్షం వచ్చినప్పుడు భూమి కూడా అదే విధమైన శోభను కలిగి ఉంటుంది. పిల్లలు ఉంటే ఎటువంటి నష్టమూ ఉండదో వర్షం వస్తే కూడా నష్టముండదని పై సామెతలు తెలుపుతున్నాయి.

మళె ఇల్లద పైరూ మాతె ఇల్లద కూసు సమ (వాన లేని పైరు తల్లిలేని బిడ్డతో సమం)

రైతులకు పొలం ప్రాణంతో సమానం. పైరు దశలో నుంచి కంటికి రెప్పలా కాపాడుకువస్తారు. అటువంటి పంతపైరుకు రైతు తండ్రి అయితే వాటికి వాన తల్లితో సమానమన్న విషయం ఈ సామెత వెల్లడిస్తుంది.

మళె బిద్దరె సూబగు ఇల్లదిద్దరె కోరగు (వానొస్తే ఆనందం రాకపోతే దుఃఖం)

భూమికి పచ్చదనమే ఇంపునిస్తుంది. ఆ పచ్చదనం వానవల్ల సాధ్యమవుతుంది. వాన వస్తే ఈ భూమి మొత్తం అందంగా తయారవుతుంది. రాకపోతే పచ్చదన పైట వివస్త్రలా వికారంగా ఉండటంతో పాటు ఎన్నో ప్రాణులకూ అన్ని రకాలుగా దుఃఖం మిగులుస్తుందని పై సామెతకు వివరణ.

మళె ముంద్ల బెళె–తాయి ముంద్ల మక్కళు

(వాన ముందు పంట–తల్లి ముందు బిడ్డాలు అందం)

అళియ బందు మరుదిన మగళ మోరె నోడు– మళె బందు మరుదిన బెళె మోరె నోడు (అల్లుడోచ్చిన తరవాత రోజు బిడ్డ బతుకు చూడు– వానొచ్చిన తర్వాతరోజు పంట చూడు)

తానెద్దు మాడ్ద బదుకల్ల మోడద్దు హుయ్యదె మళెయల్ల

(నిద్రలేచి చేసిందంతా పని కాదు–మేఘం కురిసిందంతా వాన కాదు)

ఈ సామెతలో 'పని', 'వాన' అంటే సహజ అర్థంలో ఉండే పని వానలుగా వాడబడలేదు. పొలంలో చేసినదే పని నువ్వు అక్కడా ఇక్కడ వారికి వీరికి చేసినది పనికాదు. అలాగే మేఘం నుంచి వచ్చిందంతా వర్షం కాదు. పంటకు ఉపయోగపడినదే అసలైనవర్షం.

ముంజానె మళె అల్ల మధ్యాన్నద నెంటల్ల

(పొద్దున్నే కురిసింది వానకాదు– మధ్యాహ్నం వచ్చినోళ్ళు చుట్టాలు కాదు)

పొద్దున్నే మొదలైన వర్షం చాలా సేపు కురవదు. ఒక జాము కాలమే కురుస్తుంది. సుదీర్ఘంగా కురవదు.అలాగే మధ్యాన్నం వచ్చిన చుట్టాలు పొద్దుపోయిందని వారి ఉరికి పోకుండా వీరి ఇంటిలోనే ఉండారు. ఏదైనా ఏమైనా వాన, చుట్టలు రెండు ఒక జాములో వచ్చి వెళ్ళిపోతారు.

రైత దుడిదు సూతరె–హోల బెళెదు సూతితు

(రైతు చేసి చెడిపోతారు—పండించే పొలము సారం చెడుతుంది)

రైతు వ్యవసాయం చేసి చేసి భౌతికంగాబలహీనపడుతారు–పొలం పండించి పండించి సారం తగ్గిపోతుంది. ఒక కారు సాగు చేస్తే మరొక కారు పొలాన్ని ఎండ బెడుతారు. ఆ అవకాశం లేని రైతులు దిబ్బ సత్తువలు, పై సత్తువలు(ఫర్టిలైజర్స్) అదనంగా వాడడం వెనుక ఈ సామెతలో ఉన్న అంతరార్థమదే.

అనురాధ సురిదరె మనోరోగ హోగుత్తదె (అనూరాధ తడిస్తే మనోరోగాలు పోతాయి)

వర్షం ద్వార భౌతిక ప్రయోజనాలే కాదు. మానసిక ప్రయోజనాలు కూడా తీరుతాయి. పంటలు పండుతాయా లేదా అన్న సందేహాన్ని ఈ కార్తె వాన ద్వారా తీరిపోతుంది. వానవల్ల ఈ విధమైన ప్రయోజనాన్ని కలిగిస్తాయి.

ముగింపు

భారత దేశంలో వర్ష ఆధారితంగా వ్యవసాయం చేయడం అధికంగా ఉండడం ద్వారా సామెతలు కూడా వర్షానికి సంబంధించిన సామెతలు అధికంగా ఉన్నాయి. చెరువుల ద్వారా, నదుల ద్వారా, సరస్సుల ద్వారా తక్కువ సామెతలు తక్కువగా ఉండడానికి కారణం ఆయా నీటి వసతుల ద్వారా తక్కువ సాగు జరుగుతుండటమే. ఇంకా ఈ వర్ష సామెతలను భౌగోళిక కోణంలోనూ, వాతావరణ (క్లైమటాలజీ) కోణంలోనూ పరిశోధించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఆధార గ్రంథాలు:

తెలుగు:

1. కార్, ఎం. డబ్ల్యూ. **తెలుగు సామెతలు**, నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు. 2010.
2. గంగాధరం, నేదునూరి. **పసిడి పలుకులు.** జాతీయ జ్ఞాన మందిరం, 1960.
3. చంద్రశేఖర రెడ్డి, దుర్గంపూడి. **తెలుగు సామెతలు**, ఎమెస్కో ప్రచురణలు, హైద్రాబాదు 2018.
4. దామోదర్ రావు, బొందుగులపాటి. **జానపదుల సామెతలు**, శ్రీ శాంతి ప్రింట్స్, హన్మకొండ. 1986.
5. ద్వానా శాస్త్రి, **సామెతలూ-జాతీయాలూ**. సూర్య పబ్లికేషన్స్, హైదరాబాదు, 2011.
6. నారాయనప్ప, వి. **తెలుగు సామెతలు**(vol.1) స్వీయ ప్రచురణలు డిల్లీ. 2022.
7. వసంత్, అగరం. **సామెతల సప్పరము**, కృష్ణగిరి జిల్లా రచయితల సంఘం. తమిళనాడు. 2017.
8. సత్యనారాయణ, విశ్వనాథ. **తెలుగు సామెతలు.** ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, 1959.

కన్నడ:

1. గంగా నాయక్, కె.ఎన్., గౌరీశ.పి., జానపద, కువెంపు కన్నడ అధ్యయన సంస్థ. మైసూరు యూనివర్సిటీ.మైసూరు. 2011.
2. గంగా నాయక్, కె.ఎన్., జయలక్ష్మి సీతాపుర, కన్నడ జానపద, కువెంపు కన్నడ అధ్యయన సంస్థ. మైసూరు యూనివర్సిటీ.మైసూరు. 2011.
3. గంగా నాయక్. కె.ఎన్.,(ప్ర.సం.), నంజయ్య హోంగనూరు, ఎం.(సం.), సమగ్ర కన్నడ గాదెగళు-సంపుటి-1, కువెంపు కన్నడ అధ్యయన సంస్థ. మైసూరు యూనివర్సిటీ.మైసూరు. 2012.
4. గంగా నాయక్. కె.ఎన్.,(ప్ర.సం.), నంజయ్య హోంగనూరు, ఎం.(సం.), సమగ్ర కన్నడ గాదెగళు-సంపుటి-2, కువెంపు కన్నడ అధ్యయన సంస్థ. మైసూరు యూనివర్సిటీ.మైసూరు. 2012.
5. గంగా నాయక్. కె.ఎన్.,(ప్ర.సం.), జయలక్ష్మి సీతాపుర.(సం.), సమగ్ర కన్నడ గాదెగళు సంపుటి-3, కువెంపు కన్నడ అధ్యయన సంస్థ. మైసూరు యూనివర్సిటీ.మైసూరు. 2012.